పుస్తక పరిచయం

## తెలంగాణాలో పారిశ్రామిక పోరాటాలకు ఊపిరిపోసిన తొలికాలపు సుప్రసిద్ధ ఆదర్శ కార్మికనేత

# కామ్రేడ్ సర్వదేవభట్ల రామనాథం

- జి.వి.భద్రం




**గతకాలపు** దేశచరిత్రలో, భారత కార్మికోద్యమం ఎనలేని చైతన్యపూరిత పోరాటాలను నిర్వహించింది. దేశంలోని కార్మికులకు మెరుగైన జీవన పని పరిస్థితులను, కార్మికులు సంఘటితపడి సంఘం ఏర్పాటు చేసుకొనే హక్కును సాధించింది. కార్మికులకు పలు ఆర్థిక, సంక్షేమ సదుపాయాలను, వివిధ కార్మిక చట్టాలను, కార్మికులకు చట్టపరమైన హక్కులను సాధించింది. కేవలం కార్మికుల ప్రయోజనాల కోసమే కాక, వివిధ రాజకీయ పోరాటాలను కూడా విజయవంతంగా నిర్వహించింది. కార్మికులను ఒక సంఘటితశక్తిగా ఒక వర్గశక్తిగా మలచటానికి తనతోపాటు యితర పీడిత వర్గాలన్నింటిని దోపిడీ, పీడన, అణచివేత, వివక్షతల నుండి విముక్తం చేసే పోరాటాలకు ఆ కార్మికవర్గం నాయకత్వం వహించే పాత్ర నిర్వహింపచేసేందుకు ఎనలేని కృషి చేసింది. ఈ కృషి అంతా కమ్యూనిస్టు పార్టీ నిర్దేశంలో జరిగింది. ఈ కార్మికోద్యమ నిర్మాణానికి పలువురు కామ్రేడ్లు పునాదిరాళ్ళుగా వున్నారు. కార్మికులను సంఘటితం చేసి కార్మిక సంఘాలను నిర్మించటం కోసం వారు తమ జీవితాలను అంకితం చేశారు. ఈ సంఘాల నుండి చైతన్యవంతమైన కార్యకర్తలను తయారుచేసి కమ్యూనిస్టు ఉద్యమానికి అందజేశారు.

నిజాం పాలిత తెలంగాణలో నాడు విద్య, సాంస్కృతిక రంగాల్లో వెసులుబాటు కావాలని, బాధ్యతాయుత పరిపాలన కావాలని ప్రారంభమైన పోరాటం ఆంధ్ర మహాసభ, కమ్యూనిస్టు పార్టీల నాయకత్వంలో వెట్టిచాకిరీ రద్దు, కౌలుదార్లకు రక్షణ, కౌలు రేట్లు తగ్గాలనే పోరాటంగా ఊపందుకొని, చివరకి భూమి కోసం సాగింది. నైజాం సంస్థానమే రద్దు కావాలనే పోరాటంగా తెలంగాణా జిల్లాల్లోకి తరువాత వ్యాపించింది. ఉద్యమ కేంద్ర ప్రాంతాలలో గ్రామ రాజ్యాలు ఏర్పరచుకొనే వరకు యిది పెరిగింది.

తెలంగాణాలో సాగిన యీ పోరాటం, నేటి భారత విప్లవ పోరాటానికి అవసరమైన, కీలకమైన విప్లవ పంథాకు మౌలిక ప్రాతిపదికను అందజేసింది. ఈ మహత్తర తెలంగాణా పోరాటాన్ని నిర్మించి, నిర్వహించిన కమ్యూనిస్టు పార్టీ తొలి కార్యకర్తలలో సర్వదేవభట్ల రామనాథం ముఖ్యులు. ఈ పోరాట నిర్మాణ క్రమంలో ఆయన పారిశ్రామిక కార్మికసంఘాల నిర్మాణం కోసం త్యాగపూరితమైన కృషిసల్పారు. ఆయన సంఘటితపరిచిన కార్మిక సంఘాల నుండి చైతన్యవంతులైన కార్మికులు - కార్యకర్తలు, తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటంలో వివిధ స్థాయిలలో నాయకత్వం అందించారు. పలు త్యాగాలు చేశారు. అమరులయ్యారు. ఆ రకంగా కార్మికవర్గం అనుసరించాల్సిన, నిర్వర్తించాల్సిన చారిత్రక పాత్ర నిర్వహణలో చురుకుగా పాల్గొన్నారు. కార్మికులను సంఘటితపరచి, ఐక్యంగా పోరాటాలను నిర్వహించిన ఫలితంగా హిందూ-ముస్లిం కార్మికుల్లో పటిష్టమైన ఐక్యతను సాధించారు. కార్మికులను యీ రకంగా సంఘటితపరిచి, చైతన్యపరచి పోరాటాలకు నాయకత్వం వహించే స్థాయికి మలచటానికి జరిపిన కృషిలో సర్వదేవభట్ల రామనాథం కృషి ఎంతో స్ఫూర్తి దాయకమైనది. నేడు కార్మికోద్యమాన్ని నిర్వహిస్తున్న కార్యకర్తలకు ఆయన జీవిత చరిత్ర ఎనలేని ఉత్తేజాన్ని, స్ఫూర్తిని కల్గిస్తుంది.

కార్మికుల ప్రయోజనాలను కనీసంగా కూడా పరిరక్షించలేని పేలవమయిన స్థితిలో కార్మికోద్యమం నేడున్న దుస్థితిలో - చిత్తశుద్ధితో కార్మికులను కార్మికవర్గంగా సంఘటితపరచి వర్గశక్తిగా మలచి, వారిని తమ వర్గ చారిత్రిక బాధ్యతను నిర్వహింప చేయటానికి కృషి చేస్తున్న కమ్యూనిస్టు కార్యకర్తలకు - సర్వదేవభట్ల రామనాథం జీవిత చరిత్ర స్ఫూర్తినిస్తుంది; ఉత్తేజాన్ని కల్గిస్తుంది.

### బాల్యం - విద్యాభ్యాసం

సర్వదేవభట్ల రామనాథం 1913న నవంబరులో, ఖమ్మం జిల్లాలోని, పిండిప్రోలు గ్రామంలో అగ్రవర్ణ, సనాతన, భూస్వామ్య కుటుంబంలో జన్మించారు. వేద పఠనంతో రామనాథం చదువు మొదలైంది. రామనాథం చదువు ఒక ప్రైవేటు స్కూల్లో ఖమ్మంలో మొదలయింది. తర్వాత యితర ఉన్నత వర్గాల పిల్లల వలెనే ఆయనను ప్రభుత్వ బడిలో చేర్పించారు.

దాంతో ఆయన అంగీ, పంచె, పిలకల స్థానంలో పైజమా, షేర్వానీ, రూమీ టోపీలతో బడికి వెళ్ళటం తప్పనిసరి అయి, ఆ విధంగానే ప్రభుత్వ బడికి వెళ్ళారు.

ఆ రోజుల్లో ప్రభుత్వ పాఠశాలల్లో నిజాం పేరుతో దైవప్రార్థన రోజూ తప్పనిసరిగా చేయాలనే ఫర్మానా ఉంది. ఆ ఫర్మానాకు వ్యతిరేకంగా ఖమ్మం హైస్కూలులో మొదలైన ఆందోళనకు నాయకత్వం వహించిన ముఖ్యుల్లో రామనాథం ఒకరు. రామనాథం 1927లో మెట్రిక్, 1930లో ఇంటర్మీడియట్ పాసయ్యారు. 1929లో ఏర్పడిన ఆంధ్ర మహాసభ యొక్క ప్రభావం, విద్యార్థిగా వున్న రామనాథం పైన పడింది. అంతేకాక 1932లో మధిర తాలుకాలోని అమ్మపాలెం గ్రామంలో, కాళ్ళూరి రాజేశ్వరరావు అనే దేశముఖ్ పెట్టే కష్టాలను, కేసులను తట్టుకోలేక, ఆ గ్రామ రైతులు ఆ దేశముఖ్‌ను మూడు ముక్కలుగా నరికి, చంపివేశారు. రామనాథంపై ఆ రైతుల తిరుగుబాటు ప్రభావం కూడా పడింది. 1935లో ఆయన డిగ్రీ చదువుకు హైదరాబాద్ వెళ్ళారు. 1938 నాటికి ఉస్మానియా విశ్వవిద్యాలయంలో డిగ్రీ చివరి సంవత్సరానికి వచ్చారు రామనాథం. శ్రీమంతుడయినప్పటికీ, రామనాథం తరచు ఎదుటివారి దృష్టినాకర్షించని అంగీ తొడిగేవారు. తెల్లరంగు పంచె కట్టుకొని, పైన కండువా వేసుకొని నిరాడంబరంగా వుండేవారు.

## అభ్యుదయ, విప్లవ భావాలు

1934 డిసెంబరు 13 నుండి 15 తేదీలలో ఖమ్మంలో మూడవ ఆంధ్ర మహాసభలు జరిగాయి. ఈ ఆంధ్ర మహాసభల్లో రామనాథం చురుకైన కార్యకర్తగా పనిచేశారు. ఆంధ్ర మహాసభ దేవాలయాల్లో బలుల-బాల్య వివాహాల నిషేధం, కన్యాశుల్కం, వరకట్నాల నిర్మూలన; హరిజనుల విద్యాభివృద్ధి, వివాహాల్లో ఖర్చు తగ్గింపు లాంటి సంస్కరణలను ప్రచారం చేస్తోంది. ఈ సంస్కరణలను ఆచరణలో సమర్థించినందుకు రామనాథం తదితరులను వారి కుటుంబాల నుండి వెలివేశారు. 1935-38 కాలంలో గాంధీజీ యిచ్చిన హరిజనోద్ధరణ కార్యక్రమాలు ఖమ్మం ప్రాంతంలో నిర్వహించారు. హరిజనుల్లో విద్యావ్యాప్తికి రాత్రి పాఠశాలలు వెలిశాయి. గ్రంథాలయాలు స్థాపించారు. మాల, మాదిగల అంటరానితనాన్ని నిర్మూలించటం కోసం, వారిని విద్యావంతుల్ని చేయటం కోసం ఖమ్మంలో పాఠశాలలు, ఉన్నత పాఠశాలలు నిర్మించారు. వీటి ఏర్పాటులో, ఈ ఉద్యమంలో యితరులతో కలసి ఈ కాలమంతా రామనాథం క్రియాశీల ప్రాత పోషించారు. దళిత విద్యార్థుల ఉన్నతి కోసం హరిజనులకు తలంట్లు పోయటం, పొడవాటి వారి జుట్టుకు క్షవరం చేయటం లాంటి కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నందుకు రామనాథం మరొకసారి కుల బహిష్కరణకు గురయ్యారు. దీనివలన ఆయన తన తండ్రితో ఘర్షణ పడ్డారు. సాంప్రదాయవాది అయిన రామనాథం తండ్రి నర్సయ్యగారు, వారి రెండో కొడుకైన వాసుదేవరావును-హైదరాబాద్ ఉస్మానియా కాలేజీలో ఎంబిబిఎస్ పాసై, డాక్టరుగా మొదటి బ్యాచ్ పట్టా పుచ్చుకొని, పై చదువులకోసం ప్రభుత్వం ఇంగ్లాండు పంప నిర్ణయిస్తే - అది 'అవైదిక కార్యక్రమం'గా భావించి ప్రాయోపవేశం (ప్రాణాన్ని బిగబట్టడం) చేసే ఆత్మత్యాగానికి సిద్ధపడ్డారు. అందువలన వాసుదేవరావు ఇంగ్లాండు ప్రయణం మానుకొన్నారు. 1936లో ఖమ్మం పట్టణంలో 'విజ్ఞాన నికేతన్' గ్రంథాలయం ప్రారంభించటంలోను, నిర్వహణలోను రామనాథానిదే చొరవ. 1937 నాటికి రామనాథం కమ్యూనిస్టు పార్టీ నిర్మాణ పరిధిలోకి వెళ్ళారు. 1937 మే నెలలో, గుంటూరు జిల్లా, కొత్తపట్నంలో జరిగిన, 60 మంది పాల్గొన్న రాజకీయ పాఠశాలలో, తెలంగాణా నుండి హాజరైన వ్యక్తి రామనాథమే. ఆ రకంగా ఆయన తెలంగాణాకు చెందిన తొలి కమ్యూనిస్టుగా చరిత్రలో నమోదయ్యారు. 1938లోనే తాను కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వం పొందిన సంగతి, రామనాథమే ఒక చోట పేర్కొన్నారు.

## కమ్యూనిస్టుగా....

1938లో యూనివర్శిటీలో 'వందేమాతరం' పాడినందుకు వందమంది విద్యార్థులను బహిష్కరించారు. వీరిలో రామనాథం కూడా వున్నారు. రామనాథం అప్పుడు నాగపూర్ యూనివర్శిటీలో చేరారు. త్రిపురలో కాంగ్రెస్ సభలు జరిగిన సందర్భంలో, యితర నాగపూర్ విద్యార్థులతో కలసి రామనాథం అక్కడకు వెళ్ళారు. ఈ సభలో మహారాష్ట్ర కమ్యూనిస్టు నాయకుడు ఎస్.జి.సర్దేశాయి చేసిన ఉపన్యాసానికి రామనాథం ఆకర్షితులయి, ఆయన్ను కలసి నాగపూర్‌లో వున్న కమ్యూనిస్టు పార్టీతో సంబంధాలు కొనసాగించారు. అధ్యయనాన్ని తీవ్రతరం చేశారు. 1939 మే నెలలో తునికిపాడులో జరిగిన రైతు పాఠశాలకు రామనాథం హాజరయ్యారు. రెండోసారి కూడా తునికిపాడులో క్లాసులు జరిగాయి. ఆ సందర్భంలో పార్టీ ముఖ్యుల సమావేశం జరిగింది. అప్పటి నుంచి రామనాథం కమ్యూనిస్టు పార్టీ నిర్మాణ బాధ్యతల మీద వరంగల్లు సుభాలో తిరిగారు. పార్టీ నిర్మాణం మీద, దాని పనిని సమన్వయం చేసుకొనే పద్ధతి మీద పార్టీకి తోడ్పడుతూ, రెండు సంవత్సరాల పాటు అనుభవం గడించారు. 1937-45 కాలంలో సాలెల ఉద్యమం ఖమ్మం ప్రాంతపు గ్రామాల్లో నడిచింది. కమ్యూనిస్టు పార్టీ తరపున దీని సమీకర్త రామనాథమే. సాలెలకు ప్రభుత్వం నూలు సరఫరా చేయాలని, సాలెల తరపున రామనాథం వారిని సమీకరించి, వారి తరపున ఎంతో కృషి చేశారు. 1941 నుండి ఆయన పూర్తికాలపు కమ్యూనిస్టుగా పనిచేశారు. 1942లో రామనాథం తన స్వంత యింటిని అద్దె లేకుండా హరిజన బాలికల పాఠశాల కోసం యిచ్చారు.

ప్రముఖ విప్లవ కమ్యూనిస్టు నాయకుడు కా॥ దేవులపల్లి వెంకటేశ్వరరావు కంటే కా॥ రామనాథం వయసులో 4-5 ఏళ్ళు పెద్ద. ఖమ్మం హైస్కూలు, వరంగల్ జూనియర్ కాలేజీలలో వారిరువురి చదువు ఒకే విద్యాలయాల్లో ముందూ వెనుకగా జరిగాయి. కానీ ఉస్మానియా యూనివర్శిటీలో ఒకేసారి బి.ఏ.లో చేరారు. అక్కడ జరిగిన వందేమాతర ఉద్యమం సందర్భంగా యూనివర్శిటీ నుండి ఒకేసారి బహిష్కృతులయ్యారు. తదనంతర చదువులు రామనాథం మహారాష్ట్రలోని నాగపూర్ విశ్వవిద్యాలయంలోనూ కా॥ డి.వి. మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌లోనూ కొనసాగించారు. ఆ కాలపు ప్రపంచ, దేశీయ, రాజకీయాల ప్రభావంతో విడివిడిగానే మార్క్సిస్టు సిద్ధాంత, కమ్యూనిస్టు ఉద్యమ ప్రభావంలోకి వచ్చారు. ఇరువురూ తెలంగాణ పోరాట కాలంలో ఉద్యమ నిర్మాణ బాధ్యతలు స్వీకరించారు.

## సింగరేణి కార్మికులలో విప్లవ కృషి

పార్టీ కర్తవ్యం స్వీకరించి కార్మికులలో పని చేయటానికి సంసిద్ధమయ్యారు రామనాథం. అందుకోసం సింగరేణి బొగ్గు గనులకు పయనమయ్యారు. రామనాథం అక్కడికి చేరుకొనే నాటికి, సింగరేణిలో కార్మికుల పరిస్థితి దారుణంగా వుంది. సింగరేణి కార్మికుల్లో ఎక్కువమంది నిరక్షరాశ్యులు. బ్రతుకు కోసం, చుట్టుప్రక్కల గ్రామల నుండి వలస వచ్చినవాళ్ళు. వీళ్ళలో ఎక్కువమంది నిరుపేదలు-దళితులు, గిరిజనులు, వెనుకబడిన కులాల వారు. లేబరు కాంట్రాక్టు వ్యవస్థ ద్వారా (ప్రస్తుతపు ఔట్‌సోర్సింగ్ విధానం వంటిది) గని కార్మికుల నియామకం జరిగింది. అందువలన కార్మికులు లేబర్ కాంట్రాక్టర్ల చేతుల్లో కట్టుబానిసలుగా వున్నారు. రోజుకు వాళ్ళు 12 గంటలు పని చేసేవారు. కాంట్రాక్టర్లు ఏర్పరచిన తడకలతో వేసిన తాత్కాలిక గుడిసెల్లో వుంటూ, వారు పనిచేయాల్సి వచ్చేది. చీకటి గనుల్లోకి దిగి, కిరసనాయిలు దీపం సహాయంతో రోజంతా కార్మికులు - పురుషులు, స్త్రీలు, బాలలు- బొగ్గు తవ్వేవాళ్ళు, బయటకు మోసేవాళ్ళు. యంత్రాలు లేవు. ఈ క్రమంలో ప్రమాదాలు జరిగితే చికిత్సలు లేవు. యాజమాన్యానికి బాధ్యత లేదు. రోజంతా పనిచేసినా యిచ్చే కూలీ తిండికి చాలక దినదిన గండంగా గడిపేవారు, గని కార్మికులు.

కట్టుబానిసలుగా బ్రతుకులు వెళ్ళదీసే ఆ కార్మికులను రామనాథం రహస్యంగా కలుసుకొన్నారు. వాళ్ళ సమస్యలు తెలుసుకొన్నారు. వాళ్ళను ఐక్యం చేయాలనుకొన్నారు. అప్పటికే వారిలో పనిచేస్తున్న శేషగిరిరావు, పర్సా సత్యన్నారాయణ లాంటి నాయకత్వ లక్షణాలు గలవాళ్ళను రామనాథం ఎంచుకొని, వాళ్ళను రాజకీయంగా ఎదిగించే పనిని చేబట్టారు. తమ జీవన పని పరిస్థితులను మెరుగుపరచుకోవాలన్న పట్టుదలను, స్ఫూర్తిని గని కార్మికులలో ఎగదోశారు. స్వయంగా బొగ్గు బావులలోకి దిగి కార్మికుల దుర్భర పని పరిస్థితులను, భద్రతా ఏర్పాట్లను ప్రత్యక్షంగా తెలుసుకొన్నారు. ఆ కాలంలో సింగరేణి బొగ్గు గనుల్లో తీవ్రమయిన నిర్బంధం వుంది. ఆ ప్రాంతాన్ని ప్రభుత్వం నిషిద్ధ ప్రాంతంగా ప్రకటించింది. అందువలన బయటవారు అక్కడకు వెళ్ళి కార్మికుల్లో పనిచేయటం కష్టమయిన విషయంగా వుంది. అయినా రామనాథం, తదితర పార్టీ జిల్లా నాయకులు అక్కడికి రహస్యంగా వెళ్ళి సంబంధాలు నెలకొల్పుకొని, ట్రేడ్ యూనియన్ ఏర్పాటుకు అవసరమైన పునాదులు వేశారు. మరోవైపు వ్యవసాయ కార్మికులతో సంబంధాలు పెంచుకొని, ఆంధ్ర మహాసభ శాఖలను ఏర్పాటు చేశారు. అతి తక్కువ సమయంలో గని కార్మికులు రామనాథం, శేషగిరిల నాయకత్వాన అనేక పోరాటాలు, సమ్మెలు జరిపి కొన్ని హక్కులు సాధించుకోగలిగారు. ఈ క్రమంలో గని కార్మికుల రాజకీయ చైతన్యం పెరిగింది. కార్మికుల్లో ఒక కేంద్రం (న్యూక్లియస్) తయారయ్యేవరకు, వాళ్ళు చొరవతో, స్వతంత్రంగా పనిచేసేవరకు రామనాథం, తానే బాధ్యతలు చేపట్టి సింగరేణి కార్మికులను సంఘటిత పరిచారు. బొగ్గు గని కార్మికులకు సంఘీభావంగా ఆజాంజాహీ మిల్లు కార్మికశక్తి అవసరాన్ని గుర్తించి, వారందరినీ ఒక్క నిర్మాణం క్రిందికి తెచ్చే బాధ్యతను చేపట్టారు.

## ఆజాంజాహీ కార్మికులలో కృషి

వరంగల్‌లోని ఆజాంజాహి బట్టల మిల్లు కార్మికులను రామనాథం నిత్యం కలిసి వారి సమస్యలు, దేశ పరిస్థితులను చర్చించేవారు. పార్టీ కార్యకర్తలతో కలసి రామనాథం కార్మిక వాడల్లోకి వెళ్ళి వారి యిబ్బందుల్ని అడిగి తెలుసుకొనేవారు. మిల్లు కార్మికుల్లో దాదాపు సగంమంది ముస్లిం కార్మికులే. రామనాథంగారి నిరాడంబరత, నమ్రత, మాట్లాడే పద్ధతి, ఆయన చొరవ, పట్టుదలలు ఆ ముస్లిం కార్మికులను ఆకర్షించాయి. వారు రామనాథం ఆదర్శాలకు ఒక పటిష్టమైన భూమికగా ఏర్పడ్డారు. నిరంతరం ఆయన కార్మికులను కలుసుకొనేవారు. కార్మికులకు నిజమైన సంఘం వుండాలని కోరుతూ, యూనియన్ రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు పెట్టుకొన్నారు. కార్మికుల నుండి ఏర్పడిన నాయకులు కార్మికుల సమస్యలను పరిష్కరిస్తున్నారు. అయితే యాజమాన్యం వారి కోర్కెలను పట్టించుకోలేదు. యూనియన్ రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తుపై సంతకాలు చేసిన వారిని పని నుండి తొలగించి వేసింది. యాజమాన్యపు మొండి, కక్ష సాధింపు వైఖరుల వలన మిల్లులో అనేకసార్లు ఆకస్మికంగా సమ్మెలు జరిపారు. యాజమాన్యం ఆ సందర్భాలలో పోలీసుల చేత దౌర్జన్యంతో సమ్మెలను అణచి వేసింది. ఆ మిల్లు యాజమాన్యం నిజాం కుటుంబానికి చెందినది కావటంతో, యాజమాన్యం హిందూ-ముస్లిం కార్మికుల మధ్య మత వైషమ్యాలు

రెచ్చగొట్టి, వారి ఐక్యతను చీల్చటానికి అనేక ప్రయత్నాలు జరిపింది. అయినా హిందూ – ముస్లిం కార్మికులు ఒక్కటై, ఐక్యంగా 15 రోజుల పాటు సమ్మె సాగించారు. ఈ సమ్మె తెచ్చిన హిందూ – ముస్లిం ఐక్యతను బట్టి హైదరాబాద్ సంస్థానంలో హిందూ – ముస్లింల ఐక్యత సాధ్యమేనన్న విషయం రుజువయింది. సమ్మెలో భాగంగా ఆజాంజాహీ కార్మికులు, వరంగల్ నుండి హైదరాబాద్ వరకు రామనాధం నాయకత్వంలో లాంగ్‌మార్చ్ చేసి అక్కడి పెద్ద బట్టల మిల్లు వరకు యాత్రను నిర్వహించారు. తర్వాతి కాలంలో ఆ అజాంజాహీ యూనియనే, సంస్థానం అంతటికీ గుర్తించబడ్డ మొదటి యూనియన్ అయింది. అజాంజాహీ యూనియన్‌కు రామనాధాన్ని కార్యదర్శిగా ఎన్నుకొన్నారు.

## తోళ్ళ కార్మికులు, పారిశుధ్య కార్మికుల కృషి

యూనియన్ పెట్టుకొని కార్మికులు సాధించిన పోరాటాల, విజయాల ప్రభావం తోళ్ళ కార్మికులపై పడి వారు కదిలారు. వరంగల్‌లోని 32 తోళ్ళ కార్ఖానాల్లో సుమారు 1500 మంది పని చేసేవారు. వీరి జీవన పని పరిస్థితులు అతి నికృష్టంగా వుండేవి. వరంగల్ జిల్లాలో 58 గ్రామాలకు చెందిన సాంప్రదాయ చర్మకారులైన నిరుపేద మాదిగ కులస్తులు యీ తోళ్ళ కార్ఖానాలలో పనిచేసేవారు. యజమానులు వీరిని అతి నీచంగా చూడటమేకాక, కొట్టడం, తిట్టడం, అకారణంగా పని నుండి తొలగించటం, జీతాలలో కోత (అక్రమ) పెట్టడం లాంటి అక్రమాలు చేస్తుండేవారు. వారు యూనియన్ పెట్టుకుంటే, దాన్ని నాశనం చేయటానికి యజమానులు కుయుక్తులు పన్నేవారు. ఈ సందర్భంలో రామనాధం ఇతర కార్యకర్తలతో కలసి, యీ తోళ్ళ కార్మికుల ఇళ్ళలో, వాడల్లో వుంటూ వాళ్ళని సంఘటితపరిచారు; చైతన్యవంతులను చేశారు. తోళ్ళ ఫ్యాక్టరీల యజమానుల ఎత్తులకు, పై ఎత్తులు వేసి, వారి భౌతికదాడులను ఎదిరించి, ఉపాధి హక్కులను పొందే స్థాయికి తోళ్ళ కార్మికులు చైతన్య వంతులయ్యారు. ఈ సంఘటిత క్రమంలో యోహాన్, ఏసురు, దేవానందం, జన్ను, ఇసాక్ లాంటి మరెందరో నాయకులుగా ఎదిగివచ్చారు. తమ కార్ఖానాలనే కాక, చుట్టుప్రక్కల గ్రామాలను కూడా ఓ కట్టు మీదకు తెచ్చారు.

అదే విధంగా సఫాయి కార్మికులు చాలా అధ్వాన్నంగా వున్న తమ జీవన స్థితిగతులు మార్చుకొనేందుకు సంఘాన్ని ఏర్పాటు చేసుకొని, తమ ఆందోళనల ద్వారా వెట్టిచాకిరీ, తిట్లు మొదలగు కష్టాలు పోగొట్టుకోగలిగారు. సఫాయి కార్మికుల పరిస్థితి బాగుచేయటానికి కూడా కార్యకర్తలు కృషిచేశారు. చేనేత పారిశ్రామిక ఉద్యమాన్ని కూడా కార్యకర్తలు ముందుకు తీసుకుపోయారు. సంఘాలు విరివిగా పెట్టి, వారిలో చైతన్యం కలిగించి, వారిని ఆందోళనా మార్గం పట్టించారు. మరోవైపు గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసి భూస్వామ్యాన్ని ఎదిరించే ఉద్యమాలు నిర్మించారు. ఆంధ్ర మహాసభ కాన్ఫరెన్స్ ఖమ్మం పట్టణంలో జరిగింది. దాని ఆహ్వానసంఘ అధ్యక్షులు రామనాధం ఆ మహాసభల నిర్వహణకు, ఏర్పాట్లలో ఆజాంజాహీ మిల్లు కార్మికులు, గని కార్మికులు, యితర రంగాల కార్మికులు పాలుపంచుకొని, ఆ ఏర్పాట్లు విజయవంతం చేశారు.

## రైతాంగ ఉద్యమంతో అనుసంధానం

ఈ రకంగా బొగ్గు గనుల్లో, బట్టల మిల్లుల్లో సంఘటితమయిన కార్మికులను తమ పక్కన పెల్లుబుకుతున్న రైతుల ఉద్యమంతో సంధానించారు. తమ సమస్యలపైనే కాక వీరు రైతు ఉద్యమాలకు తోడై నిలిచారు. 1941 నుండి 1946 చివరి వరకూ ఎన్నో ప్రాణాంతక గూండా దాడుల్ని, పోలీసు కాల్పులను ఎదిరించి, అజ్ఞాతంగా వుంటూ, పోలీసు అరెస్టులు తప్పుకుంటూ, రామనాధం కార్మికులను సంఘటితం చేశారు. 30 సెప్టెంబరు 1946న పోలీసులు రామనాధాన్ని ఖమ్మంలో అరెస్టు చేశారు. అప్పుడు నిజాం సంస్థానపు ప్రధాన మంత్రి మీర్జాయిస్మాయిల్ వరంగల్ పర్యటనకు వచ్చాడు. తోళ్ళ కార్మికులు ఆయన దగ్గరికి ఊరేగింపుగా వెళ్ళారు. వారితో బాటు ఆజాంజాహి కార్మికులు కూడా వెళ్ళి తమ నాయకులను విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.

రామనాధం కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రలో నాడు విప్లవ వైతాళిక పాత్రను పోషించారు. తొలి కమ్యూనిస్టుగా ఆయన పోషించిన యీ వైతాళిక పాత్ర నేటికీ ఎంతో స్ఫూర్తిదాయకమైనది.

ఆయన తన అగ్రవర్ణ, అగ్రవర్గ స్థితిని పరిత్యాగం చేసి శ్రామిక వర్గీకరణ, వర్గాంతీకరణ చెందారు. కమ్యూనిస్టు కార్యకర్తలుగా పనిచేసేవారు విధిగా శ్రామికవర్గీకరణ, వర్గాంతీకరణ చెందాల్సిన దాన్ని ఆయన ఆచరణాత్మకంగా పాటించారు. ఎర్రజెండా రాజ్యం కోసం సాయుధ విప్లవ పంథాను చేపట్టారు. తన వాటాకు వచ్చిన 1800 ఎకరాల భూమిని 'దున్నేవారికే భూమి' ప్రాతిపదికపై పేదలకు పంపిణీ చేశారు.

అత్యంత పేదరికాన్ని ఆయన అనుభవించారు. 1978లో ఒకప్పటి ఆయన ఉద్యమ సహచరులు, కార్యకర్తలు ఆయన పరిస్థితిని కళ్ళారా చూసి రామనాధం ముందు ఒక ప్రతిపాదన చేశారు. ఆయన పంచి యిచ్చిన భూములు కొన్నిటికి యింకా పట్టాలు రాలేదు. ఈ భూములను రైతులు రామనాధానికి ఎకరా 50/– రూపాయల చొప్పున తిరిగి యిచ్చేటట్లు చేస్తామన్నది ఆ ప్రతిపాదన. ఆయన ఆ ప్రతిపాదనను నిరాకరించటమే గాక, తాను ఖమ్మం వచ్చి, తానిచ్చిన ఆ భూములకు పట్టాలివ్వటం కోసం సంతకం పెడ్తానని చెప్పారు.

అదే విధంగా 1978లోనే, వర్షాకాలంలో ఒకనాడు ఎడతెగని వర్షం కురుస్తోంది. ఆ వర్షానికి రామనాథం నివసించే గుడిసె నిలవదని గమనించిన రామనాథం మిత్రులు, ఇంగ్లీషు లెక్చరర్ సూర్యనారాయణ, రామనాథాన్ని వెంటనే తీసుకురమ్మని తన శిష్యులను పంపారు. అప్పుడు రామనాథం "నాకేమీ కాలేదు.... కానీ, మీలాంటి యువకులు ఆలోచించాల్సింది.... ఈ మాత్రం గుడిసె కూడా లేని వేలాది మందిని గురించి...." అని చెప్పి వారిని పంపివేశారు.

పై రెండు ఉదంతాలను బట్టి దారుణ జీవన పరిస్థితుల్లో సహితం రామనాథం తన కమ్యూనిస్టు ఆదర్శం పట్ల ఎంతటి అచంచలంగా వున్నారో అర్థమవుతుంది.

1951 ఏప్రియల్‌లో వినోభా, తెలంగాణా సాయుధ పోరాటం నిలుపుదల జేయటానికీ, కమ్యూనిస్టులను ఎన్నికల్లో పాల్గొనేట్లు ఒప్పించటానికి ప్రభుత్వ రాయబారాలు నడుపుతున్న దానిలో భాగంగా, జైళ్ళకు వెళ్ళి చర్చ జరపటం మొదలు పెట్టాడు. ఆ పర్యటనలో వినోభా వరంగల్ జైలుకు వచ్చి, కమ్యూనిస్టు ఖైదీలను కలిశాడు. వారిలో రామనాథం కూడా వున్నారు. ఆ చర్చలలో వినోభా తాను తెలంగాణా గ్రామాలు తిరిగాననీ, కమ్యూనిస్టులు గ్రామాలపై దాడులు చేస్తున్నారనీ, ప్రజలను వేధిస్తున్నారనీ తనకు తెలిసినట్లు చెప్పి, సాయుధ పోరాటం ఆపివేస్తున్నట్లు, ఎన్నికలలో పాల్గొంటామని ప్రకటన చేయాల్సిందిగా కోరారు. రామనాథం ఆయనకు ఘాటుగా జవాబిచ్చారు. 'మీరు మా వాళ్ళని లాకప్పుల్లో పెట్టి హింసిస్తున్నారు కదా! అందువలన పోరాటం మానము' అని ఆయన అన్నారు. కమ్యూనిస్టుల గురించి వినోభాకు అందిన సమాచారం తప్పని చెప్పి, గ్రామస్థులపై యూనియన్ సైన్యాలు జరిపిన దాడులు, ప్రజలను బాధించిన తీరును, జరిపిన మానభంగాలను, గృహ దహనాలను, గ్రామస్థులను మూకుమ్మడిగా మందలుగా చేసి కమ్యూనిస్టులని చూపండి అని చితక బాదిన వైనాన్ని ఆయనకు వరంగల్ జైలు కమ్యూనిస్టు ఖైదీలు వివరించి చెప్పి, కమ్యూనిస్టుల పైకి పోలీసు యాక్షన్‌గా పిలవబడే మిలటరీ యాక్షన్ ఎక్కుపెట్టబడిన విషయం వినోభాకు ఎత్తిచూపారు.

ఆ తర్వాత సెప్టెంబర్‌లో తెలంగాణా పోరాట భవితవ్యం, విరమణలపై జైళ్ళలో వున్న కామ్రేడ్సుతో చర్చించడానికి జ్యోతిబసు, ఎ.కె. గోపాలన్, రామ్మూర్తి కలిసారు. అప్పుడు పోరాటం దెబ్బతిన్నదని రావి నారాయణ రెడ్డి అభిప్రాయం చెబితే, సర్వదేవభట్ల రామనాథం "ఇంకా పోరాటం" నడుస్తున్నదనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

సాయుధ పోరాట లక్ష్యం గురించి రామనాథం "మిలటరీ యాక్షన్" తర్వాత వెంటనే పోరాటం విరమించాలని అనటం సరైనది కాదు.... సాధించుకొన్న విజయాలను ముందు మనకు మనం రక్షించుకోవటం ప్రధాన సమస్య.... ప్రజలు మనకు దూరం అయ్యారనటం నిజం కాదు. అనేక చర్యల్లో ప్రజలు పాల్గొన్నారు. పోలీసుల ముట్టడిలో చిక్కుకున్న కామ్రేడ్స్‌ను ప్రజలు వారికి పట్టించలేదు; పైగా పోలీసుల కదలికల రహస్యాలు చెప్పేవారు. చేలల్లో మనల్ని దాచేవారు" అని తన అభిప్రాయాన్ని నవంబరు 22 నుండి 29 వరకు 1953లో జరిగిన వరంగల్ జిల్లా మహాసభలో వ్యక్తం చేశారు.

తన జీవిత సర్వస్వాన్ని ఉద్యమానికి అంకితం చేసిన మహనీయులు కా॥ రామనాథం. ఆయన 1952లో అసెంబ్లీకి జరిగిన ఉపఎన్నికలలో ఘన విజయం సాధించారు. తదుపరి 1957, 1962 పార్లమెంటు ఎన్నికలకు పోటీ చేసి అపజయం పొందారు.

1962 ఎన్నికల ఓటమి నుంచి ఆయన రాజకీయాల్లో క్రియాశీలకంగా లేరు. ఆ రకంగా ప్రారంభ కమ్యూనిస్టు ఉద్యమ (తెలంగాణాలో) పునాది రాయిగా మారిన మహోన్నత వ్యక్తి కా॥ సర్వదేవభట్ల రామనాథం. వీరి జీవిత చరిత్ర నేటికీ స్ఫూర్తిదాయకమైనదే! ప్రత్యేకించి నేటి తరాల కార్యకర్తలకు మరింత స్ఫూర్తిదాయకంగా వుంటుంది.

చిత్తశుద్ధితో కార్మికవర్గ ఉద్యమ విజయాన్ని కోరుకొనే కార్యకర్తలందరూ యీ పుస్తకం తప్పనిసరిగా చదవాలి. అందువలన వారు మరింత ప్రభావవంతంగా, దృఢ విశ్వాసంతో తమ కృషిని కొనసాగించగలుగుతారన్నది నిస్సందేహం!

*సర్వదేవభట్ల రామనాథం జీవిత చరిత్రను ఆర్. శివలింగం గారు పరిశోధిస్తే, కా॥ కె. ముత్యం "కష్టాల కొలిమి–త్యాగాల శిఖరం, సర్వదేవభట్ల రామనాథం జీవితం" అనే గ్రంథంగా మలిచారు. ఈ పుస్తకాన్ని రాయల సుభాష్ చంద్రబోస్ మెమోరియల్ ట్రస్టు, ఖమ్మం వారు తమ తొలి ప్రచురణగా అందించారు. వీరి యీ కృషి అభినందనీయమైనది. 312 పేజీల ఈ పుస్తకం వెల : రూ. 200/-*

★★★★★